బతుకమ్మ కుంట పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్‌లోని శేషాద్రినగర్‌లోని నల్ల చెరువు పక్కన బతుకమ్మ కుంట ఏర్పాటు పనులను గురువారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో శేషాద్రినగర్ వెల్ఫేర్ అధ్యక్షులు ప్రభాకర్‌రావు, చంద్రోఖర్ రెడ్డి, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సినిమా, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో శ్రీ సర్వేశ్వరా నాట్యమండలి హైదరాబాద్ వారు కూకట్‌పల్లి భారత్ వికాస్ పరిషత్ హాలులో శ్రీకృష్ణ రాయబారం నాటకాన్ని గురువారం ప్రదర్శించారు. మన్నే సర్వేశ్వరరావు, కె. లక్ష్మణరావు శ్రీకృష్ణ పాత్రలు ధరించారు. మామిడి సంజీవరావు, జి. మణిపాల్ రెడ్డి, నాగేశ్వరరావు, రఘు పాల్గొన్నారు. టి. బాబురాజు కార్యక్రమాన్ని నిర్వహించగా.. టి. రాజబాబు దర్శకత్వం వహించారు.

పల్లె దవాఖానాకు చేయూతనివ్వాలి



బీపీ యంత్రాన్ని వైద్యాధికారికి అందజేస్తున్న సుబ్బారావు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్ తోటలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాకు రోగులకు, సిబ్బందికి అవసరమైన పరికరాలను అందజేయాలని అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం అవంతినగర్ తోట సంక్షేమ సంఘం కన్వీనర్ టీవీ సుబ్బారావు పల్లె దవాఖానాకు బీపీ యంత్రాన్ని వైద్యాధికారి డాక్టర్ ఎస్‌వీ దుర్గకు అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న పీయూష్ మిట్టల్, అరుణ ప్రదీప్, విద్యార్థులు

మూసాపేట: సత్యసాయి విద్యా మందిరం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హెచ్‌పి రోడ్డులోని బయో కెమికల్ రోడ్డులో గురువారం శ్రమదానం నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీయూష్ మిట్టల్, సాయి సేవా సంఘ సెక్రటరీ అరుణ ప్రదీప్‌లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక రోజు, ఒక గంట, ఒక్కసారి నినాదంతో ఈ శ్రమదానం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యామందిర్ విద్యార్థులు, ఇండియల్ ఆయిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



బాలానగర్: డివిజన్‌లోని చెరబండ రాజు నగర్‌లో గురువారం డ్రైనేజీ పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ అనిల్‌కుమార్, నాయకులు మొహమద్ ఖాజా, దేవులపల్లి కృష్ణమూర్తి, రంగంపేట్ శ్రీనివాస్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సంద్ర సునీల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సిహెచ్. సాగర్ పాల్గొన్నారు.

కనులపండువగా దేవీ నవరాత్రులు

కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవ రాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. పలు దేవాలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్‌లు, పార్టీల నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

– కూకట్‌పల్లి(జోన్‌బృందం)



శారద శంకర పీఠంలో వైష్ణవి దేవి అలంకరణలో అమ్మవారు



అవంతినగర్ తోటలో కాత్యాయనిదేవిగా



కేపీహెచ్‌బీ కాలనీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వైష్ణవి దేవిగా..



వివేకానందనగర్ రోడ్డు నెంబర్ 6 డి బ్లాక్‌లో వనదేవత పూజలో పాల్గొన్న భక్తులు



కూకట్‌పల్లి సప్తమాతృక పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



దేవినగర్‌లోని పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న వెంగళరావు తదితరులు



మూసాపేట ప్రగతినగర్‌లో.. మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం

- వయోజనులు అప్రమత్తంగా ఉండాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్

కూకట్‌పల్లి: ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు చోరీకి గురి కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఓట్ల చోరీ అనేది ప్రజాస్వామ మనుగడకే ప్రమాదమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా తీసుకున్న ఓట్ చోరీ కార్యక్రమానికి మద్దతుగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో గురువారం కూకట్‌పల్లిలో విద్యార్థులు, స్థానిక ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పాలకపక్షం వారికి అనుకూలంగా ఓట్లను తీసేయటం, జాబితాలో నమోదు చేయడం వంటి అవకతవకలకు పాల్పడుతోందని విమర్శించారు. దీన్ని నిరోధించడానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాటం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గోపిశెట్టి రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణపై జోనల్ కమిషనర్‌తో సమీక్ష



సమావేశంలో పాల్గొన్న జెడ్సీ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ సబిహాబేగం తదితరులు

మోతీనగర్: జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను ఆయన కార్యాలయంలో కార్పొరేటర్ సబిహాబేగం సఫ్దార్‌నగర్ నాలా విస్తరణపై స్థానికులతో కలిసి గురువారం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఎస్‌ఎన్‌డీపీ కింద నాలా విస్తరణ పనుల కోసం రూ.29 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో భాగంగా జోనల్ కమిషనర్ సమక్షంలో స్థానికులతో చర్చించి వారి సలహాలు, సూచనల మేరకు నాలా విస్తరణ వెడల్పును 8 మీటర్లకు నిర్ణయించామని తెలిపారు. అదే విధంగా నాలా విస్తరణ పనుల సమయంలో ఏవైనా గృహాలకు హాని జరిగితే తగిన నష్ట పరిహారం అందజేస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో అబ్దుల్ హమీద్, షేక్ రఫిక్, అబ్దుల్, సలీం తదితరులు పాల్గొన్నారు.

జింకలవాడలో సదుపాయాల కల్పనకు కృషి

మూసాపేట: జింకలవాడలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. గురువారం జింకలవాడలో జీహెచ్‌ఎంసీ ఏఈ రాధాకృష్ణతో కలిసి సమస్యలపై పర్యటించారు. స్థానికులు కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్ శిథిలావస్థకు చేరిందని, దానిని పునర్నిర్మించాలని కోరారు. కమ్యూనిటీ హాల్ ముందు సీసీ రోడ్డు వేయించి, గేట్లు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా బస్తీకి ఆనుకొని ఉన్న 150 గజాల స్థలంలో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో బస్తీలో దాదాపు అన్ని పనులు పూర్తి చేశామన్నారు. నాలా ముంపు నుంచి బస్తీ ముంపునకు గురి కాకుండా రిటర్నింగ్ వాల్‌ని కూడా ఏర్పాటు చేశామన్నారు. స్థానికులు తెలిపిన పనులకు కూడా త్వరలో నిధులు మంజూరు చేయించుకొని ప్రారంభిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జింకలవాడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాములు, మాజీ వార్డు మెంబర్ రాజకుమార్, రుక్మయ్య, సురేష్, నరసింహ, కోటి, ఫారుఖ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.



నాలా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ తదితరులు

పనుల పరిశీలన

మూసాపేట: హబీబ్‌నగర్‌లో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ వద్ద డ్రైనేజీ వ్యవస్థకు నూతన పైపులైన్ వేస్తున్నారు. గురువారం పైపు లైన్ పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పరిశీలించారు. కార్యక్రమంలో యాదుల్, షరీఫ్, ఖాజా మియా పాల్గొన్నారు.



ఫంక్షన్‌హాల్ పనుల్లో నాణ్యత పాటించాలి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్‌లో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులను గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలు నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ నిర్మాణం పూర్తయ్యిందని అన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, పనుల్లో తప్పనిసరిగా నాణ్యత పాటించాలన్నారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, జి. రవి, షౌకత్ అలీ మున్నా, ముజీబ్, అగ్రవాసు, సిద్ధయ్య, మహేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..





కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో మహిళలు, యువతులు బతుకమ్మలను ఒక వేదిక వద్దకు చేర్చి చుట్టు ఆడుతూ పాడుతూ సందడి చేశారు. కొలనులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – కూకట్‌పల్లి



పెద్ద బతుకమ్మను తీసుకువస్తూ..



కూకట్‌పల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

హెచ్‌సీయూలో '50 ఏళ్ల భారత అత్యవసర పరిస్థితి'పై చర్చ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో '50 సంవత్సరాల భారత అత్యవసర పరిస్థితి' అనే అంశంపై పుస్తక చర్చా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు తమ అభిప్రాయాలను తెలిపారు. రాజకీయ, చారిత్రక, చట్టపరమైన, ఆర్థిక, తాత్విక, అనుభవ, సాంస్కృతిక అంశాల ద్వారా అత్యవసర పరిస్థితి భారత దేశ ప్రజాస్వామ్యాన్ని ఎలా రూపొందించిందో సమగ్రంగా అందిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రాజకీయ శాస్త్ర విభాగం ఫ్యాకల్టీ జ్యోతిర్మయశర్మ , చరిత్రకారిణి, రచయిత సుమంత బెనర్జీ, ఫ్యాకల్టీ అనఘా ఇంగోల్, కెకె కైలాష్ ప్రసంగించారు.

ఎమ్మెల్యే సమీక్ష

చందానగర్ : చందానగర్ సర్కిల్– 21 పరిధిలోని చందానగర్, మాదాపూర్, హఫీజ్‌పేట్, మియాపూర్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై గురువారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపకమిషనర్ శశిరేఖ నేతృత్వంలో ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు డివిజన్లలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు.

ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త!

- ఇంట్లో ఆభరణాలు, నగదు పెట్టొద్దు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బాలానగర్: పండగలకు ఊళ్లకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దొంగల బారి నుంచి తప్పించుకోవచ్చు. దొంగకు దొంగతనం చేసేందుకు ఏ ఒక్క ఆస్కారం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఊర్లెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని బాలానగర్ ఏసీపీ నరేష్‌రెడ్డి అన్నారు.

- తప్పనిసరిగా ఇంటి ముందు నాణ్యత కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుకోవాలి. కెమెరా తప్పనిసరిగా బయటకు కనిపించేలా ఉండాలి.
- మన ఇంటి సీసీ కెమెరాల ఫుటేజీ మన సెల్‌ఫోన్‌లో వచ్చేలా ఇంటర్నెట్‌కు అనుసంధానం చేసుకోవాలి. తరచుగా సీసీ కెమెరా రికార్డింగ్ మన సెల్‌ఫోన్‌లో చెక్ చేసుకుంటూ ఉండాలి. ఏదైన అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో బంగారం, నగదు ఉంటే తప్పనిసరిగా బ్యాంకులో డిపాజిట్ చేసుకోవడం, లాకర్‌లలో భద్రపర్చడం మంచింది.
- మనం ఇంటికి సంబంధించిన ఆర్థిక విషయాలను తెలిసినవారికి సైతం తెలపకుండా జాగ్రత్త పడాలి. ఇంటిలోని ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలి.
- దొంగతనం చేసే ముందు దొంగ తప్పనిసరిగా రక్కీ నిర్వహిస్తాడు కాబట్టి మన ఇంటి గేటుకు తాళం లోపలి నుంచి వేయాలి. ప్రధాన ద్వారానికి లోపలి నుంచి గడియపెట్టి రెండో వైపునకు ఉన్న డోర్‌కు తాళం వేయాలి.
- వీలైతే ఇంటి ప్రధాన ద్వారానికి ఎలక్ట్రానిక్, సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలి.
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కార్లలో ఉంచకూడదు. ద్విచక్ర వాహనాలను రోడ్లలో కాకుండా ఇళ్లలోపల పార్కింగ్ చేసుకోవాలి.
- మనం న్యూస్‌పేపర్, పాలప్యాకెట్లు వేయించుకున్నట్టైతే పేపర్, పాల వారికి ముందుగానే సమాచారం ఇచ్చి వేయవద్దని చెప్పాలి.
- మనం ఊరెళ్తున్న విషయాన్ని ఇంటి పక్క వారికి గాని, పక్కింటి వారికి విషయాన్ని తెలియజేయాలి.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి



సాధారణ రోజుల్లో కంటే పండుగ సెలవుల సందర్భంగా దొంగతనాలు జరగడానికి ఆస్కారం ఎక్కువ ఉంటుంది. పండుగ కోసం ఊర్లెళ్లే వారు విలువైన వస్తువులను భద్రపర్చుకోవడం మంచిది. ఎక్కువ రోజులు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడం వల్ల పెట్రోలింగ్ నిర్వహించి నిఘా ఏర్పాటు చేస్తాం.

– పింగళి నరేష్‌రెడ్డి, బాలానగర్ ఏసీపీ

- రద్దీలో ఉన్న బస్సులో ప్రయాణిస్తున్నపుడు తమ విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలి. బస్సులో బ్యాగులు ఎక్కడో పెట్టి ఆదమరిచి ఉండకూడదు.
- అదేవిదంగా నమ్మకమైన సెక్యూరిటీగార్డులు, వాచ్‌మెన్‌లను నియమించుకోవాలి. కాలనీ వారు కమిటీలు వేసుకుని రాత్రిళ్లు ఎవరైనా పహారా కాచేలా చూసుకోవాలి.
- కొత్తవ్యక్తుల కదలికలపై 100కు, వాట్సాప్ 9490617444నెంబరుకు సమాచారం అందించాలి.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి

కూకట్‌పల్లి/ఓల్డ్‌బోయిన్‌పల్లి : భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 109 జయంతిని గురువారం ఆయా డివిజన్‌లలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ తత్వాన్ని దేశానికి అందించిన మహానుభావుడని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టి సనాతన ధర్మాన్ని వ్యాప్తి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు.



జయంతిలో పాల్గొన్న కాంతారావు, రాజేశ్వరరావు



నివాళులర్పిస్తున్న తిరుపతి తదితరులు